ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

సంగారెడ్డి మెదక్

బుధవారం 23 అక్టోబరు 2024

జిల్లాల వార్తలు



కరెంట్ షాక్‌తో
గురుకుల విద్యార్థులకు గాయాలు

- క్రీడా పోటీలకు జెండా పాతుతుండగా విద్యుత్ వైర్లకు తగిలిన పోల్.. నలుగురికి గాయాలు
- హవేళీఘణపూర్ జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో ఘటన

7



బిడెకన్నె శివారులోని దట్టమైన చెట్ల మధ్య అరణ్య పెర్మాకల్చర్ ఫాం

ఒకేసారి పెట్టుబడి.. శాశ్వత దిగుబడి

- బిడెకన్నె శివారులో పెర్మాకల్చర్ సాగు
- ఇరవై ఏళ్ల క్రితం శ్రీకారం చుట్టిన అరణ్య సంస్థ



అరణ్య వ్యవసాయక్షేత్రంలో పెర్మాకల్చర్ విధానంలో పండించిన దానిమ్మ

రెండు దశాబ్దాల క్రితం ఆ భూమి బీడుగా ఉండేది. శాశ్వత సాగు పద్ధతిలో పచ్చని నేలగా మార్చారు. పెర్మాకల్చర్(శాశ్వత వ్యవసాయం) విధానంలో పండ్లు, పూలు, కూరగాయలతో పాటు వాణిజ్య పంటలైన అల్లం, పసుపు, తృణధాన్యాలను సాగు చేస్తూ ప్రకృతి వ్యవసాయానికి చిరునామాగా నిలిపారు. ఒకసారి పెట్టుబడి పెట్టి, సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ శాశ్వతంగా దిగుబడులు సాధిస్తున్నారు. సహజ పద్ధతులతో సేద్యం చేస్తూ ఆరోగ్యకర ఆహార పదార్థాలను అందించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలో బిడెకన్నె గ్రామ శివారులో 20 ఏళ్లుగా అరణ్య పెర్మాకల్చర్ సంస్థ శాశ్వత వ్యవసాయ సాగు విధానాన్ని కొనసాగిస్తూ ప్రకృతితో మమేకమవుతున్నది.

7

మున్సిపాలిటీగా ఉన్న సంగారెడ్డి పట్టణం ఇక కార్పొరేషన్‌గా అవతరించనున్నది. రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల హోదాను పెంచుతున్న దృష్ట్యా ఆ జాబితాలో సంగారెడ్డికి సైతం చోటు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జిల్లా అధికార యంత్రాంగం కూడా పూర్తి నివేదికతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. అదేవిధంగా సంగారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇక మెదక్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసి మెదక్ పట్టణం తోపాటుగా పరిసర గ్రామాలను దీని పరిధిలోకి తీసుకురావడానికి కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది.



సంగారెడ్డి ఇక కార్పొరేషన్

- మున్సిపాలిటీలో ఎనిమిది గ్రామాలు విలీనం
- వచ్చే ఎన్నికల వరకు 50 డివిజన్లు
- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం
- పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- 'ముడా' పరిధిలోకి మెదక్ పట్టణం, పరిసర గ్రామాలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, అక్టోబరు 22 : ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 17 మున్సిపాలిటీలు ఉన్నాయి. కానీ ఒక్క కార్పొరేషన్ కూడా లేదనే లోటు వెంటాడుతూ ఉండేది. కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే ఇటు రాజకీయంగా, సామాజికంగా, భౌగోళికంగానూ అనేక మార్పులు చేర్పులు ఉంటాయి. ప్రత్యేక గుర్తింపు సైతం దక్కుతుంది. ఈ కోవలోకి సంగారెడ్డి పట్టణం త్వరలోనే చేరనున్నట్లు తెలిసింది.

గ్రామాలను విలీనం చేసి

గత మున్సిపల్ ఎన్నికలకు ముందు సంగారెడ్డి మున్సిపాలిటీలో పోతిరెడ్డిపల్లి, చింతల్‌పల్లి, మల్కాపూర్‌లోని కొంతభాగాన్ని విలీనం చేశారు. వచ్చే జనవరిలోనే మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉంది. అప్పటిలోగా సంగారెడ్డిని కార్పొరేషన్‌గా హోదా పెంచాలనే కసరత్తు జరుగుతోంది. ఈ క్రమంలో సంగారెడ్డి మున్సిపాలిటీలోకి

...తరువాయి 8వ పేజీలో



పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి సంగారెడ్డి, మెదక్

రాష్ట్రంలో కొత్తగా 18 పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి, మెదక్ ఉన్నాయి. 2017లో సిద్దిపేటలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయగా, దీని పరిధిలో 26 గ్రామాలు ఉన్నాయి. లేఅవుట్ల ఏర్పాటు, ప్రత్యేక నిధుల సమీకరణ, సుందరీకరణ తదితర అంశాల్లో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఉపయుక్తంగా మారింది. అందుకే సంగారెడ్డి మున్సిపాలిటీతోపాటు మెదక్ మున్సిపాలిటీలను ఎంపిక చేసి చుట్టూ 10కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాలనూ ఈ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. సంగారెడ్డి నగరపాలక సంస్థగా మారనుండగా, మెదక్ అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఏర్పాటుకానున్నది. త్వరలోనే స్పష్టమైన ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి.

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు

- ఖేడ్‌లో 8 ఏళ్లుగా ఏడీఏ కార్యాలయ భవనం శిలాఫలకానికే పరిమితం
- ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు... సమావేశాలకు రైతువేదికే దిక్కు

8



సమర్థవంతమైన పాలనే లక్ష్యం


- సమయపాలన పాటిస్తే శాఖల పనితీరు మెరుగు పడుతుంది
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

8

3డీ రీకన్‌స్ట్రక్షన్‌తో కృత్రిమ పుర్రె

- సంగారెడ్డిలోని 'హోప్ న్యూరో'లో అరుదైన శస్త్ర చికిత్స

7



టైటానియంతో తయారు చేసిన కృత్రిమ పుర్రె భాగం

సన్న, దొడ్డు వడ్లకు వేర్వేరు కేంద్రాలు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వెల్దుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దొడ్డు, సన్న వడ్ల కొనుగోలు కోసం వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం అందించనుందన్నారు. మంగళవారం ఆయన వెల్దుర్తిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల్లో మరో రెండు రోజుల్లో కొనుగోళ్లను మొదలుపెడతారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తుందని, దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. ధాన్యం విక్రయించిన తర్వాత 48 గంటలలోపు రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతుందన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యంను ఆరబెట్టి తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రధాన రహదారి నుంచి మెదక్‌కు వెళ్లే రోడ్డు పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని వచ్చిన ఫిర్యాదుపై ఆయన పరిశీలించి విచారణ చేపట్టారు. వెల్దుర్తిలోని ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ అక్రమాలపై డీఎస్‌వోకు ఫోన్ చేసి విచారణ వివరాలను అడిగారు. సంబంధిత శాఖ నివేదిక ప్రకారం గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, వెల్దుర్తి తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు

- శుభ్రపర్చిన వడ్ల కొనుగోలుకు సిద్ధం
- తడిసిన ధాన్యం ఆరబెట్టడానికి డ్రయర్ల ఏర్పాటు
- పౌర సరఫరాల శాఖ డీఎం హరికృష్ణ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



పౌర సరఫరాల శాఖ డీఎం హరికృష్ణ

మెదక్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరగడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరికృష్ణ చెప్పారు. పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగినప్పుడు చిన్నపాటి పొరపాట్లు జరగడం సహజమేనని, పూర్తిగా శుభ్రపర్చిన ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే వెంటనే చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని ఆయన రైతులకు సూచించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి ఆయనను ఇంటర్వ్యూ చేసింది.

జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసింది. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తారా?

డీఎం : వరి కోతకొచ్చిన సమయంలో వానలు కురియడం విచారకరం. తడి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ధాన్యంలో తేమ 17 శాతం మించకూడదని నిబంధనలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం రైతులు తడిసిన ధాన్యం ఆరబెట్టుకుని, శుభ్రపర్చిన తర్వాతనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గత యాసంగిలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి రైస్ మిల్లర్లు ముందుకు రాకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మళ్లీ ఆ పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

ఇప్పటికే జిల్లాలో దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోంది. నిలువరించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

డీఎం : ప్రస్తుత వర్షాలకు ఆరబోసుకున్న ధాన్యం తడిసిపోయింది. ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే తప్పనిసరి నిబంధనలు పాటించాల్సిందే. తేమ శాతం విషయంలో కచ్చితత్వం పాటించాలని ఆదేశాలున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తక్కువ ధర వచ్చినా సరే అంటూ అప్పటికప్పుడు ధాన్యం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్, ప్రక్క జిల్లాల నుంచి వచ్చిన దళారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రైవేటు వ్యక్తులు క్వింటాలు ధాన్యానికి రూ. 1850 నుంచి రూ.1900 వరకు చెల్లిస్తున్నారని తెలుస్తోంది. దీని వల్ల రైతులు భారీగా నష్టపోయే అవకాశం ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకూ వేచిచూసి, ఆతర్వాత వరి చేలు కోసి, ఆరబెట్టి, కేంద్రాలలో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుంది.

ఎన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు? డ్రయర్లను ఏర్పాటు చేస్తున్నారా?

డీఎం : ఈ రోజు వరకు 300 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో 490 కేంద్రాలను ప్రారంభించనున్నాం. ప్రస్తుతం కోతలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల్లో ప్రారంభించాం. ధాన్యం రవాణా చేసేందుకు అవసరమైన లారీలను ఏర్పాటు చేస్తున్నాం. ధాన్యం ఆరబెట్టేందుకు డ్రయర్లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. సివిల్ సప్లై కమిషనర్ ఇప్పటికే లేఖ రాశాం. టేక్మాల్ మండలం కుసంగి రైతు సహకార కేంద్రం ఆధ్వర్యంలో ధాన్యంలో మాయిశ్చర్ శాతం తగ్గించడానికి డ్రయర్‌ను వినియోగిస్తున్నారు. ఈ యంత్రం గంటకు 6 శాతం తేమ తగ్గిస్తుంది. తడిసిన ధాన్యంలో సుమారు 40 శాతం వరకు తేమ ఉండే అవకాశం ఉంది.

ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత?

డీఎం : జిల్లా వ్యాప్తంగా 490 కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నాం. ఇందులో దొడ్డురకం ధాన్యం 2.80 లక్షల ఎంటీలు, సన్నాలు 1.20 ఎంటీలు కొనుగోలు చేయనున్నాం.

వైద్య ఆరోగ్య శాఖలో నియామకాల ప్రక్రియ షురూ

నేడు బస్తీదవాఖానా డాక్టర్లకు కౌన్సెలింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, పలు సర్కారు ఆస్పత్రుల్లోని వివిధ విభాగాల్లో ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేసేందుకు జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద 97 పోస్టులకు గత ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 3 వేల వరకు దరఖాస్తులు రాగా, ఎంపీ ఎన్నికల కోడ్‌తో నాడు ప్రక్రియను నిలిపేశారు. కోడ్ ముగిసినా నియామకాల ప్రక్రియ చేపట్టలేదు. ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పలుమార్లు కథనాలు ప్రచురించింది. తాజాగా ఈ నెల 9 వ తేదీన 'పెద్దాయన ఓకే అంటేనే' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు ప్రారంభించారు. జారీ చేసిన నోటిఫికేషన్‌లో బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఏడు ఉన్నాయి. మార్చిలోనే ఈ పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితా వెల్లడించారు. తాజా ఆదేశాలతో బస్తీ దవాఖానా మెడికల్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి మంగళవారం ఒక్క రోజే ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్ వెల్లడించడం గమనార్హం. రెండు లిస్టులు ఒకేరోజు ప్రదర్శించడమే కాకుండా ఈ నెల 23న కలెక్టరేట్‌లో నియామక కౌన్సెలింగ్ నిర్వహించడం పలు అనుమానాలకు తావిస్తున్నది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎలాంటి సమాచారం లేకుండానే గుట్టుగా ఒకే రోజు రెండింటిని జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్‌లో పొందుపర్చడం ఏంటని పలువురు అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్‌క్వాస్, లక్ష్యకు పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి ఎంపిక



పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి

పటాన్‌చెరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న పటాన్‌చెరు టంగుటూరి అంజయ్య ఏరియా ఆసుపత్రికి కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌క్వాస్, లక్ష్య సర్టిఫికెట్‌కు ఎంపిక చేసినట్లు జాతీయ హెల్త్ మిషన్ డైరెక్టర్ ఆరాధనాపట్నాయక్ ప్రకటించారు. ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగంలో అందిస్తున్న సేవలు, ల్యాబ్‌లు, ఫార్మసీ, వార్డులు, లేబర్ రూంలను గతంలో కేంద్ర ప్రభుత్వ బృందం పరిశీలించింది. వారు సంతృప్తి వ్యక్తం చేసి నాణ్యత సేవల ప్రమాణాలకు అందించే సర్టిఫికెట్ల జారీకి ఆసుపత్రిని ఎంపిక చేశారు. దీంతో ఆసుపత్రికి ప్రత్యేక నిధులు సమకూరనున్నాయి. ఆసుపత్రి సూపరెంటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



మెదక్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్

ప్రభుత్వాల దయ కాదు.. ఉద్యోగుల హక్కు

- డీఏ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- మెదక్ జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దొంత నరేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి) : కరువు భత్యం ప్రకటించడం ప్రభుత్వాల దయగా కాదని, ఉద్యోగుల హక్కు అని జిల్లా ఉద్యోగుల ఐకాస చైర్మన్ దొంత నరేందర్ అన్నారు. ఉద్యోగులకు సహజంగా రావాల్సిన ఐదు విడతల కరువు భత్యం, అన్ని రకాల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం భోజన విరామ సమయంలో ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ హయాంలో కాలయాపన జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంబిస్తుందన్నారు. ఐదేళ్లకోసారి ఇచ్చే పీఆర్సీ ఊసేలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ పట్ల నిర్లక్ష్యపు ధోరణి వీడినాడాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, మహేందర్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, సంగయ్య, జగదీష్‌చంద్ర, జయాకర్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, టీఎస్టీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, టీఎస్టీవో, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

నంగునూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామానికి చెందిన ఖానాపురం సాయి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై మంగళవారం బద్దిపడగ గ్రామ శివారులోని చెట్లపొదల్లోకి వెళ్లి గడ్డి మందు తాగుతూ తాను చనిపోతున్నానంటూ తన స్నేహితులకు వాట్సప్‌లో పోస్ట్ చేశాడు. దీంతో స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు అతని ఫోన్ కాల్‌ను ట్రేస్ చేసి గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న సాయిని 108 అంబులెన్స్‌లో మొదట సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



గంజాయి మొక్కలను చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఇంటి పెరట్లో గంజాయి సాగు

అల్లాదుర్గం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామంలోని ఓ ఇంటి పెరట్లో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదైంది. మెదక్ ఎక్సైజ్ సీఐ సీహెచ్ నాగేశ్వరరావు కథనం ప్రకారం గ్రామానికి చెందిన క్యాసారం అంజయ్య తన ఇంటి వెనక భాగంలోని పేరట్లో గంజాయి సాగు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు ఈ దాడిలో ఎస్‌ఐ మాన్‌సింగ్, సిబ్బంది సిద్ధయ్య, సర్దార్ అలీ, రవి, వెంకటేశ్, నరేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి కాళ్లు, చేతులు కట్టేసి చోరీ

● ఐదు తులాల బంగారం, రూ.20 వేలు తస్కరణ

వట్‌పల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న ఇంటి యజమాని కాళ్లు చేతులు కట్టివేసి దోపిడికి పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పల్వట్ల గ్రామంలో సోమవారం నాటి రాత్రి జరిగింది. స్థానిక పోలీసులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పల్వట్ల గ్రామానికి చెందిన సునందమ్మ తన నివాసంలో ఒక్కరే నిద్రిస్తున్న క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని దుండగలు ఇంట్లోకి చొరబడి సునందమ్మ కాళ్లు చేతులు కట్టివేశారన్నారు. అనంతరం ఇంట్లో బీరువాలో ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును అపహరించుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పై జోగిపేట సీఐ అనీల్‌కుమార్ మంగళవారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

కరెంట్ షాక్‌తో గురుకుల విద్యార్థులకు గాయాలు

హవేళిఘణపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడా పోటీల కోసం జెండాలు పాతుతున్న విద్యార్థినులకు కరెంట్ షాక్ తగిలి గాయాలైన ఘటన మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగింది. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో బుధవారం నుంచి వారం రోజుల పాటు జిల్లాస్థాయి క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా పాఠశాల గేటు వద్ద విద్యార్థినుల రజిత, గాయత్రి, తనుష్క, వసంతతో పాటు పక్కనే ఉన్న బాలుర గురుకుల పాఠశాలకు చెందిన దీక్షిత్ జెండాలు పాతుతున్నారు. జెండా పైపు విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్‌కు గురై నలుగురు విద్యార్థినులు గాయపడ్డారు. వెంటనే వారిని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సింధురేణుక. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విద్యార్థులను పరామర్శించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



బుజ్జిబాయి(ఫైల్)

కౌడిపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గిరిజన మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని జాజితండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తండా సమీపంలో విశ్రాంత ఆర్మీ అధికారికి ప్రభుత్వం ఇచ్చిన ఐదు ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని శోభ అనే మహిళ కబ్జా చేసి వరి పంట సాగు చేసి రక్షణ నిమిత్తం విద్యుత్ కంచెను ఏర్పాటు చేసింది. మంగళవారం పగలు అయినా విద్యుత్ సరఫరా నిలిపివేయలేదు. తండాకు చెందిన కాట్రోత్ బుజ్జి (38) మేకలను అటు మేతకు తీసుకెళ్లగా విద్యుదాఘాతంతో మేకలు మృతి చెందాయి. వాటిని తీసుకువచ్చేందుకు వెళ్లిన బుజ్జి కూడా షాక్‌కు గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న శోభ కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పారిపోయారు. శోభ కుటుంబ సభ్యులు వచ్చే వరకు మృతదేహాన్ని తీసేదిలేదని మృతురాలి కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా అసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్ రెడ్డి తెలిపారు.

ఫ్యూజులు వేస్తుండగా హెల్పర్..



నవీన్ యాదవ్(ఫైల్)

ఝరాసంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై హెల్పర్ మృతి చెందిన సంఘటన ఝరాసంగం మండలంలోని చిల్కేపల్లిలో మంగళవారం సాయంత్రం జరిగింది. సంబంధిత అధికారులు, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేయించి బిగించారు. దీంతో ఫ్యూజులు వేయడానికి విధ/విద్యుత్ శాఖలో హెల్పర్‌గా పనిచేస్తున్న నవీన్‌కుమార్(35) మంగళవారం సాయంత్రం త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో అతడు షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత విద్యుత్ అధికారులు అక్కడికి చేరుకురి విచారణ జరిపారు. అనంతరం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్ కంచె తగిలి యువరైతు..

వట్‌పల్లి, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి) విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పోతులకుబోడ గ్రామంలో చోటుచేసుకుంది గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మర్రి చెట్టు కాడి శివ శంకర్(30) తన సొంత పొలానికి పందుల బెడద నివారణ కోసం విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లిన అతడు ప్రమాదవశాస్తు విద్యుత్ కంచెకు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందారు

ఒకేసారి పెట్టుబడి.. శాశ్వత దిగుబడి



పెర్మా కల్చర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

జహీరాబాద్ ప్రాంతంలోని ఎర్ర నేల భూముల్లో ఎన్నో రకాల పంటలను సాగు చేయవచ్చు. ప్రస్తుతానికి సజ్జ, కొర్ర, రాగులు, పెసర, మినుము పంటలను సాగు చేస్తున్నాం. ఈ వ్యవసాయం గత 20 సంవత్సరాల నుంచి చేపడుతున్నాం. పెర్మాకల్చర్ పై ఈ ప్రాంతంలోని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో రసాయనిక ఎరువులు వాడిన పండించిన పంటల నుంచి వచిచన ఆహార పదార్థాలను కొనుగోలు చేసి అనారోగ్యాల బారిన పడుతున్నాం. భూమిపై ఉండే ప్రతీ జీవి బతకాలన్నదే మా లక్ష్యం.

-కొప్పుల పద్మ, అరణ్య సీఈవో

● పెర్మాకల్చర్ పద్ధతిలో సాగు
● 9 ఎకరాల్లో పలు రకాల పండ్ల తోటలు, తృణధాన్యాలు, కూరగాయల పంటలు..
● రెండు దశాబ్దాలుగా సాగు



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పండ్ల పంటలు

అక్కడ అడుగు పెడితే చాలు.. ఎటూ చూసిన పెద్ద పెద్ద చెట్లు, పచ్చని తోటలు దర్శనమిస్తాయి. వివిధ రకాలు పండ్ల చెట్లు, కూరగాయలు తోటలు, తృణధాన్యాల పంటలతో అదొక మినీ అడవినే తలపిస్తది. ఒక్కసారి పెట్టుబడితో మొక్కలు పెట్టగా.. శాశ్వత దిగుబడి లభిస్తున్నది. ఇంతటి ప్రాధాన్యమున్న ఆ సాగు చేసున్నదని ఎక్కడో కాదు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధిలో గల బిడెకన్నె గ్రామం శివారులోని దట్టమైన చెట్ల మధ్యన ఉన్న అరణ్య పెర్మాకల్చర్‌లో.

-ఝరాసంగం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

అందులోకి వెళ్లగానే ఆ ప్రకృతి రమణీయతకు మరికాసేపు అక్కడే సేదా తీరితే బాగుటుందని అనిపించక మానదు. సాయంత్రం సూర్యుడు అస్తమించే సమయంలో పక్షులు, పిచ్చుకల కిలకిల రావాలతో ఆ ప్రాంతం కంటికి ఇంపుగా.. చెవికి వినసొంపుగా అనిపిస్తుంది. రెండు ఎకరాల్లో సేంద్రియ ఎరువులను ఉపయోగించి గత కొన్ని సంవత్సరాల నుంచి పెసర, మినుము, సజ్జ, కొర్ర, రాగులతో పాటు అల్లం, పసుపు వంటి వాణిజ్య పంటలనూ సాగు చేస్తున్నారు. వీటి మధ్యలో టమాటా, వంకాయ, బీరకాయ, సోరకాయ తదితర కాయగూరల తోటలను సాగు చేస్తున్నారు. చెట్ల ఆకులతో మల్చింగ్ పద్ధతిలో ఎరువులను తయారు చేసి పంటలకు వాడుతున్నారు. ఇక్కడ సంవత్సరం పొడవునా పలు రకాల పండ్లు లభిస్తాయి.

ప్రకృతి సహిత సాగు..

పర్మనెంట్ అగ్రికల్చర్ పదాల నుంచి వచ్చిన పదమే పెర్మాకల్చర్. దీన్నే శాశ్వత సాగు పద్ధతి అని కూడా పిలుస్తారు. ఇంకా అర్థమయ్యేలా చెప్పాలంటే ప్రకృతి సహిత వ్యవసాయం. పాడి పంటలు అని పేరుకే అంటున్నాం.. కానీ ఇప్పటి రైతులు చాలమంది పాడికి దూరమయ్యారు. విత్తనాలు, మందుల కోసం ఇతరులపై ఆధారపడుతూ ప్రకృతి వైవిధ్యం కోల్పోడానికి కారకులుగా మారుతున్నారు. ఫలితంగా రైతులు పెద్ద ఎత్తున నష్టాలను చవిచూడాల్సి వస్తున్నది. దీనికి పూర్తి విరుద్ధంగా ప్రారంభమైన ఉద్యమమే పెర్మాకల్చర్.

బీడు భూమి సాగులోకి..

రెండు దశాబ్దాల క్రితం ఈ భూమి బీడుగా ఉండేది. ఆ భూమిని పెర్మా పద్ధతి వ్యవసాయానికి ఎంచుకుని.. అంచలంచెలుగా సాగులోకి తెచ్చి సారవంతంగా మార్చారు. కొప్పుల నర్సన్న 1989లో ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ పెర్మాకల్చర్‌ని అభ్యసించారు. ఈ ప్రాంతంలోని రైతులను ఆ విధానం వైపు తీసుకెళ్లాలన్నదే ఆయన లక్ష్యం. అందులో భాగంగానే ఝరాసంగం మండలంలోని బిడెకన్నె శివారులో 1999లో 11.20 ఎకరాల పెర్మాకల్చర్ విధానంలో వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. అదే ప్రస్తుతం సేంద్రియ అరణ్యగా మారింది. ఆ అనుభావాలే వేల మందికి పాఠాలయ్యాయి. 2014 నుంచి పెర్మాకల్చర్ వ్యవసాయంపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. కరోనా కంటే ముందు విదేశాల నుంచి విద్యార్థినులు, విద్యార్థులు వచ్చి ఈ వ్యవసాయంపై శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం కూడా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులు వచ్చి 15-20 రోజులు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు.



అరణ్యలో పండించిన అల్లనేరెడు, మామిడి పండ్లు

3డీ రీకన్‌స్ట్రక్షన్‌తో కృత్రిమ పుర్రె

● 'హోప్ న్యూరో'లో అరుదైన శస్త్ర చికిత్స

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ ఆస్పత్రి డాక్టర్లు తొలిసారిగా అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. కొండాపూర్ మండలం మల్లేపల్లికి చెందిన మహేందర్‌రెడ్డి(45) గత జూలై 2 వ తేదీన తలకు గాయం కావడంతో తలనొప్పి, వింత ప్రవర్తనతో హోప్ ఆస్పత్రికి వచ్చారు. మహేందర్‌రెడ్డిని పరీక్షించిన డాక్టర్లు సీటీ స్కాన్ చేయగా తలకి ఎడమ వైపు మెదడు భాగంలో రక్తం గడ్డ ఉందని నిర్ధారించి ఆపరేషన్ ద్వారా రక్తం గడ్డను తొలగించారు. అయితే మరుసటి రోజే మళ్లీ రక్తస్రావం కావడంతో అతడికి మళ్లీ ఆపరేషన్ ద్వారా రక్తం గడ్డను తొలగించారు. ఆ సమయంలో మెదడుకి ఎక్కువగా వాపు రావడంతో మెదడుపై ఒత్తిడిని నివారించే క్రమంలో కొంత పుర్రే భాగాన్ని తొలగించాల్సిన అవసరం ఏర్పడింది. తదనంతరం ఐదు రోజుల్లో పేషెంట్ పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. తాజాగా ఈ నెల 15 వ తేదీన మెదడు వాపు పూర్తిగా తగ్గిన తర్వాత మళ్లీ సీటీస్కాన్ చేసి తొలగించిన పుర్రె భాగాన్ని 3డీ-రీకన్‌స్ట్రక్షన్‌తో దానికి సరిపడా టైటానియంతో చేయబడిన కృత్రిమ పుర్రెభాగాన్ని తయారు చేసి పేషెంట్‌కి అమర్చారు. ప్రస్తుతం ఆయనను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి పంపారు. అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన హోప్ న్యూరో ఆస్పత్రి అధినేత, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ల బృందాన్ని పేషెంట్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



డాక్టర్ కృష్ణమూర్తి

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : హత్నూర ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి మొత్తం 172 సీట్లకు 113 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9963004960 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

25న ఐఐటీహెచ్‌లో 'ది పిచ్' కార్యక్రమం



కంది, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ప్యూర్ ఈవీ స్టార్టప్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న ది పిచ్ పేరుతో ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన నగరాల్లో దీన్ని నిర్వహించనున్నారు. ఇందులో యువ ఆవిష్కర్తలకు నిధులను సమీకరించడానికి వీసీ సర్కిల్ సంస్థ కృషి చేస్తుంది. ప్యూర్ ఈవీ సంస్థ ఐఐటీ హైదరాబాద్‌లో అంకుర సంస్థగా మొదలై ఎలక్ట్రిక్ వాహనరంగంలో ప్రముఖ సంస్థగా ఎదిగింది. ప్యూర్ ఈవీ ఏర్పాటు, టెక్నాలజీ వ్యాపార నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించడానికి చేసిన కృషి గురించి ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ నిశాంత్ దొంగరి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 25 స్టార్టప్ సంస్థలు, 60 మందికి పైగా ఇన్వెస్టర్లు పాల్గొంటారని నిశాంత్ దొంగరి తెలిపారు.

న్యాయం చేస్తారా.. చనిపోమంటారా?

● బతికి ఉండగానే మరణించాడని భూమి పట్టా మార్పు
● పురుగులమందు డబ్బాతో బాధిత రైతు ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న ఉప్పరి పోచయ్య

వర్గల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాను బతికుండగానే చనిపోయినట్లు నిర్ధారించి తన భూమిని వేరొకరి పేరా పట్టా చేశారని, తనకు న్యాయం చేస్తారా.. చనిపోమంటారా.. అంటూ ఓ రైతు కుటుంబంతో కలిసి మంగళవారం వర్గల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన రైతు ఉప్పరి పోచయ్యకు వంశపారపర్యంగా వచ్చిన 36 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. గత ప్రభుత్వం 2018 సంవత్సరంలో ధరణి ద్వారా పట్టా పాస్‌బుక్ అందజేశారు. మూడు సంవత్సరాల క్రితం రైతుబంధు రాకపోవడంతో కార్యాలయానికి వెళ్లి అధికారులను ఆరా తీయగా వేరొకరి పేరా పట్టా మార్పు జరిగిందని చెబుతూ పాస్‌బుక్‌లో క్యాన్సల్డ్ స్టాంపు వేసి ఇచ్చారు. దీనిపై అధికారులను నిలదీయగా వారు రికార్డులు పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన మరోవ్యక్తి ఉప్పరి పోచయ్య మరణించడంతో అతని కొడుకు రామస్వామి పౌతి కోసం దరఖాస్తు చేసుకోగా.. అధికారుల తప్పిదంతో బతికున్న ఉప్పరి పోచయ్య భూమిని మరణించిన ఉప్పరి పోచయ్య వారసుడికి పట్టా చేశారు. తిరిగి తన భూమిని తన పేరా చేయాలని బాధిత రైతు అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా, కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో మంగళవారం నిరసనకు దిగాడు. దీనిపై స్పందించిన తహసీల్దార్ బాల్‌రాజు మాట్లాడుతూ పొరపాటున పట్టా మార్పు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, పూర్తి విచారణ చేసి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు.

ప్రేమికుడితో పెళ్లి కావడం లేదని..

● యువతి ఆత్మహత్య

జగదేవ్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడితో వివాహం కావడం లేదన్న కారణంతో యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన దాసరి మల్లమ్మ, కొండయ్య దంపతుల రెండో కుమార్తె అర్చన(18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆ యువతి గతంలో గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించగా, తల్లిదండ్రులు వారి ప్రేమను అంగీకరించలేదు. మరో యువకుడితో పెళ్లి చేసేందుకు ఇటీవల నిర్ణయించారు. దీంతో మనస్తాపానికి గురైన అర్చన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో కానిస్టేబుల్ భార్య ..

తూప్రాన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన కానిస్టేబుల్ భార్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తూప్రాన్ పట్టణానికి చెందిన గుజ్జ భూమేష్ మెదక్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. భూమేష్‌కు భార్య గుజ్జ కవిత (38)తో గతంలో గొడవలు జరగగా వేరుగా ఉంటున్నట్లు తెలిసింది. కొడుకు ఇంటర్మీడియట్ చదువుతూ హాస్టల్ ఉంటుండగా, కూతురు తల్లి కవిత వద్దనే ఉంటుంది. మంగళవారం ఉదయం కూతురును పాఠశాలలో చేర్పి ఇంటికి వచ్చిన కవిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తూ..





చెరువులోకి కొట్టుకుపోయిన ధాన్యాన్ని తీసుకువస్తున్న మహిళా రైతులు



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న మహిళ

రైతు కష్టం.. చెరువు పాలు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చెరువుపాలైంది. సోమవారం ఒక్కసారిగా కురిసిన వర్షం కారణంగా సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వరదలో ధాన్యం కొట్టుకుపోయి పక్కనే ఉన్న చింతల్ చెరువులో కలిసింది. దీంతో రైతులు ఆ ధాన్యాన్ని ఒకచోటకు చేర్చుతూ ఇన్ని రోజుల కష్టాన్ని తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

-సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

ఈ నెల 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేసుకోవాలి

హత్నూర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకొని విచారణ చేయించుకొని లబ్ధిదారులు వెంటనే గ్రామపంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని ఎంపీడీవో శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హత్నూర మండలం కాసాల గ్రామం పంచాయతీ పరిధిలో 780 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు గాను 159మంది ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఇంకా దరఖాస్తులను పరిశీలించడానికి ముందుకు రాలేదని ఎంపీడీవో తెలిపారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంజేపీ విద్యార్థినులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే(ఎంజేపీ-జోగిపేట)రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల కంది ఐఐటీహెచ్‌లో జరిగిన జిల్లాస్థాయి హాకీ పోటీల్లో పాఠశాలలో పదోతరగతి చదువుతున్న నవనీత, అనూషలు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ రజినీ, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు..

శివ్వంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర విభాగంలో వాలీబాల్ పోటీలకు రాష్ట్రస్థాయి జట్టుకు శివ్వంపేట ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి పి. రాంచరణ్, దొంతి ఉన్నత పాఠశాలకు చెందిన తరుణ్ తేజ్ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఎంపిక కావడం పట్ల ఎంఈవో బుచ్యానాయక్, పాఠశాల హెచ్‌ఎంలు బాలచంద్రం, శ్రీనివాసులు వారిని అభినందించారు. విద్యార్థులు ఈనెల 28 నుంచి 30వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీలు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అందరికీ అవగాహనకలిగి ఉండాలని బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాణెన్న, న్యాయవాదులు సోమశేఖర్, రుద్రయ్యస్వామి తదితరులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హుగ్గెల్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ప్రజలు రైతులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

మెదక్ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం స్థానిక రాందాస్ చౌరస్తాలో ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ విద్యపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, విధ్వంసం చేస్తుందని ఆరోపించారు.

ప్రారంభమైన ఇర్ఫానీ దర్గా ఉర్సు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని ఇర్ఫానీ దర్గా ఉర్సు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా దర్గాకు వివిధ రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు జామియా మస్జిద్ నుంచి సాయంత్రం గంధం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాత్రి గంధారాదన చేసి ఆల్ ఇండియా ముసాయిదా కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు దర్గా నిర్వాహకులు హకీమ్ ఒమర్ బీన్ అహ్మద్ సజ్జద్ యే నఫీస్ బార్గ ఇర్ఫానీ అన్న ప్రసాద వితరణ, మంచినీటి బాటిళ్లు అందజేశారు.

కాంగ్రెస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాష విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ముందు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ధర్నా చేశారు. పోటీ పరీక్షల కోసం జిల్లాకు మూడు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్వో పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జహీరాబాద్,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సీఎం సహాయనిధి నిధులను సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 8మంది లబ్ధిదారులకు రూ.1.76లక్షలు విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మశ్చందర్, ఆయా మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. కాగా జహీరాబాద్ ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో కొమురంభీం జయంతిని ఘనంగా నిర్వహించారు.

శంకుస్థాపన చేశారు.. పనులు మరిచారు



ఏవో కార్యాలయంలోని ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్న ఏడీఏ కార్యాలయం

- నారాయణఖేడ్‌లో 8 ఏళ్లుగా శిలాఫలకానికే పరిమితమైన ఏడీఏ కార్యాలయ భవనం పనులు
- ఇరుకు గదుల్లోనే సిబ్బంది విధులు
- సిబ్బంది, రైతులతో సమావేశాలకు రైతువేదికే దిక్కు

నారాయణఖేడ్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా, ఆచరణలో కనిపించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నారాయణఖేడ్‌లో వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం నిర్మాణం పనులు కొన్నేళ్లుగా శిలాఫలకానికే పరిమితం కావడం ఇందుకు నిదర్శనమని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

శిలాఫలకానికే పరిమితం

రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు అనువుగా ఉండే విధంగా వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ భవనం నిర్మాణం కోసం గత రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. అప్పటి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి భవనం పనులకు శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ఏడీఏ కార్యాలయం నిర్మాణం పనులు శిలాఫలకానికే పరిమితమయ్యాయి.

సమావేశాలకు ఇబ్బందే

నారాయణఖేడ్ ఎంపీపీ, ప్రస్తుత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో రెండు దశాబ్దాల క్రితం ఏవో కార్యాలయాన్ని నిర్మించారు. ఏడీఏకు ప్రత్యేకంగా కార్యాలయం లేక పోవడంతో ఏవో కార్యాలయంలోనే ఏడీఏ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఆత్మ కార్యాలయంతో పాటు ఏడీఏ కార్యాలయం కొనసాగుతుండడంతో డివిజన్ పరిధిలోని 32 మంది ఏఈవోలు, ఆరుగురు ఏవోలు, ఇతర సిబ్బంది ప్రతి రోజు ఏవో కార్యాలయానికి వస్తుంటారు. రెండు గదులు మాత్రమే ఉండడంతో, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. ఎరువుల వ్యాపారులు, అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయాలంటే కార్యాలయంలో ఇబ్బంది తలెత్తుతుండడంతో జూక్కల్ శివారులో రైతు వేదికలో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

శిలాఫలకం కనుమరుగయ్యే దుస్థితి



ఏడీఏ కార్యాలయం నిర్మాణం పనులు పూర్తి చేస్తే డివిజన్ పరిధిలోని ఏవోలకు, ఏఈవోలకు రైతులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిర్మాణం పనులకు సంబంధించిన శిలాఫలకం వేసి వదిలి వేయడంతో ప్రస్తుతం శిలాఫలకం ఆనవాళ్లు కూడా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏడీఏ కార్యాలయ భవనం నిర్మాణం పనులను వెంటనే ప్రారంభించి, పూర్తి చేయిస్తే అధికారులతో పాటు అందరికి ఉపయోగపడుతుందని పలువురు అంటున్నారు.

శివారు కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్, పటాన్‌చెరు మండలాల పరిధిలోని హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడా, సుల్తాన్‌పూర్, ఇంద్రేశం, ముత్తంగి తదితర శివారు గ్రామాల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయన్నారు. పెద్దఎత్తున జనావాసాలు వస్తున్న స్థాయిలో మౌలిక వసతులు కల్పించడం లేదని వివరించారు. వర్షాకాలంలో అనేక కాలనీలు నీట మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మౌలిక వసతులు కల్పించకుండా శివారు గ్రామాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు, మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ త్వరలోనే ఆయా కాలనీలను నేరుగా పర్యటించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో మండల బీజేపీ అధ్యక్షుడు ఈర్ల రాజు, నాయకులు ఉన్నారు.

సమర్థవంతమైన పాలనే లక్ష్యం: మెదక్ కలెక్టర్

మెదక్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమర్థవంతమైన పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడంతో శాఖల పనితీరు మెరుగుపడుతుందని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీపీవో, సివిల్ సప్లయ్, డీఆర్డీఏ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 160 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కెమెరాలను సర్వలెన్స్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఏ ఒక్క అధికారి విధుల్లో ఆలసత్వం వహించిన సహించేది లేదన్నారు.



కొల్చారం: రంగంపేట కొనుగోలు కేంద్రంలో కలెక్టర్

- కొల్చారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రంగంపేట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 497 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన సెంటర్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు.

అంకిత భావంతో పని చేయాలి: సంగారెడ్డి ఎస్పీ



జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో సూచనలు ఇస్తున్న ఎస్పీ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, తెలంగాణ రాష్ట్ర పోలీసుశాఖకు మంచి పేరు తేవాలని జిల్లా ఎస్పీ రూపేష్ సూచించారు. సంగారెడ్డి శివారు చిద్రుప్పలోని పోలీసు శిక్షణా కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నెలల బేసిక్ శిక్షణ పూర్తి కావస్తున్న సందర్భంగా ఫైనల్ ఇండోర్, అవుట్‌డోర్ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. పోలీసు శాఖలో ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సవాళ్లను ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ

జిన్నారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే ప్రతీ కేసు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. మంగళవారం జిన్నారం, గుమ్మడిదల పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ రూపేష్ సందర్శించారు. జిన్నారం సీఐ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన ఎస్పీ అనంతరం గుమ్మడిదలలో నిర్మిస్తున్న నూతన పోలీస్‌స్టేషన్ భవనం పనులు పరిశీలించారు. వెంట సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో ట్రైనీ సివిల్ సర్వీసెస్ బృందాల పర్యటన



రామాయంపేట: ధర్మారంలో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేస్తున్న ట్రైనీ అధికారులు

నర్సాపూర్/రామాయంపేట/మనోహరాబాద్/కౌడిపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష అవగాహన కోసం వచ్చిన ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు మంగళవారం పలు మండలాల్లో పర్యటించి సిబ్బంది ద్వారా వివిధ విషయాలు అడిగి తెలుసుకున్నారు. నర్సాపూర్ మండలంలో ఆవంచ రామాయంపేట మండల పరిధి ధర్మారం, మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలో, కౌడిపల్లి మండలంలోని రాయిలాపూర్‌లో సందర్శించి, ప్రభుత్వ పథకాల వివరాలు అమలు తీరు తెలుసుకున్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలి



నిజాంపేటలో నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు

తూప్రాన్/చేగుంట/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/మాసాయిపేట/పాపన్నపేట/నిజాంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మెదక్ జిల్లాల్లోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనలు తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే ప్రకటించి విడుదల చేయాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. తూప్రాన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లంతో కలిసి ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చేగుంట, నార్సింగి మండలాల్లో మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలల్లో ఉపాధ్యాయులు తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, తీగుళ్ళ స్వామి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెద్దశంకరంపేట, మాసాయిపేట, పాపన్నపేట, నిజాంపేట లోని ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

- నారాయణఖేడ్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న డీఏలు, అన్నిరకాల బిల్లులను వెంటనే చెల్లించి, పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఖేడ్ మండల పరిధిలోని రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

మిన్‌పూర్‌లో పోలీస్ పికెటింగ్

- 15 మంది సిబ్బందితో బందోబస్తు

పుల్కల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం మిన్‌పూర్‌లో చేపల చెరువుల విషయమై ముదిరాజులు ఇతర కులాలకు మధ్య వివాదం తలెత్తడంతో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. చేపలు పట్టుకునే విషయమై గత జూన్‌లో ఘర్షణ వాతావరణం కొనసాగింది. ఇందులో భాగంగానే రెవెన్యూ, పోలీసు, మత్స్య శాఖ అధికారులు సోమవారం గ్రామ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొని ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య ఆదేశాల మేరకు పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో 15మంది పోలీసులతో సోమవారం అర్ధరాత్రి నుంచి పికెటింగ్ ఏర్పాటు చేశారు. పది చెరువులు, కుంటలకు పెద్ద (తూం) చెరువు మినహా మిగిలిన అన్నింటిలో అన్నివర్గాల ప్రజలు చేపలు పట్టుకునేలా ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు.

మెదక్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



తూప్రాన్‌లో పోలీసుల బైక్ ర్యాలీ

మెదక్ అర్బన్/తూప్రాన్/రామాయంపేట/పెద్దశంకరంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ, సమాజ సేవ, శాంతి భద్రతల పట్ల మెదక్ జిల్లా పోలీసు సిబ్బంది నిబద్ధతను కలిగి ఉంటుందని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది, ప్రజలు, యువకులతో కలిసి సైకిల్, బైక్ ర్యాలీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు చేపట్టిన సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు ఈ నెల 30 వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, సాయుధ దళ డీఎస్పీ రంగా నాయక్, పట్టణ, రూరల్ సీఐలు నాగరాజు, రాజశేఖర్, ఏఆర్‌ఎస్ఐలు, జిల్లా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. తూప్రాన్ పట్టణంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. తూప్రాన్ పోలీసుస్టేషన్ నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు నిర్వహించి, పోలీసుస్టేషన్ వరకు కొనసాగించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్ చౌరస్తాలో పోలీసు అమరవీరులను స్మరిస్తూ నినాదాలు చేశారు. రామాయంపేట సర్కిల్ పరిధిలో ఎస్ఐలు, సిబ్బంది, యువజన సంఘాల వారు సైకిల్ బైక్ ర్యాలీ చేపట్టారు. మొదట వెంకట రాజా గౌడ్ ర్యాలీ ప్రారంభించగా పోలీసులు, యువకులు పురవీధుల గుండా ఊరేగింపుగా కదిలారు.పెద్దశంకరంపేటలో అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, పేట ఎస్ఐ శంకర్‌ల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శివ్వంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆన్ లైన్ లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుగు, హిందీ, ఉర్దూ భాషల్లో నిర్వహించడం జరుగుతుందని ఇంటర్మీడియట్ విద్యార్థులకు విచక్షణతో కూడిన మొబైల్ వాడకం అంశం, డిగ్రీ విద్యార్థులకు తెలంగాణ డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశంపై ఆన్ లైన్ లో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు.

సంగారెడ్డి.. ఇక కార్పొరేషన్

(ఐదో పేజీ తరువాయి)

ఫసల్‌వాది, మల్కాపూర్, నాగాపూర్, ఇర్గిపల్లి, కులబ్‌గూరు, చిమ్నాపూర్, కలబ్‌గూరు, కంది గ్రామాలను చేరుస్తున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 1.20 లక్షల జనాభా ఉండగా ఈ గ్రామాల విలీనంతో 2 లక్షల జనాభా దాటనున్నది. ఫలితంగా కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

సర్పంచ్‌లకు బదులు కార్పొరేటర్లు

ప్రస్తుతం సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులు ఉన్నాయి. వార్డుల నుంచి కౌన్సిలర్లు గెలుపొంది తమలో ఒకరిని రిజర్వేషన్ ఆధారంగా చైర్మన్‌ను ఎన్నుకుంటున్నారు. అయితే ఈసారి వార్డులకు బదులుగా డివిజన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతీ డివిజన్ నుంచి కార్పొరేటర్ అభ్యర్థులు బరిలోకి దిగుతారు. మున్సిపల్ చైర్మన్‌కు బదులుగా కార్పొరేషన్ మేయర్ ఆధిపత్యం ఉంటుంది. హోదాతోపాటు సర్వహక్కులు మేయర్‌కు ఉంటాయి. 38 మున్సిపల్ వార్డులను 50 కార్పొరేషన్ డివిజన్లకు పెంచాలనే యోచనలో ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక వచ్చే పంచాయతీ ఎన్నికల్లో సంగారెడ్డి మున్సిపాలిటీలో విలీనమయ్యే గ్రామాలను మినహాయించక తప్పదు. ఈ గ్రామాల్లోనూ సర్పంచ్‌లకు బదులుగా కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తారు. ఎనిమిది గ్రామాల్లో ఇకపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డుసభ్యుల ప్రాతినిధ్యం ఉండదు. మొత్తంగా కార్పొరేటర్లు, ఆపైన డిప్యూటీ మేయర్, మేయర్ మాత్రమే ఉంటారు. ఈ పదవులకు పోటాపోటీ తప్పకపోవచ్చు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఫోటో: 22ఎండీకే63-మృతుని ఫైల్ ఫోటో



కృష్ణ(ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి చెందిన ముష్టి గొల్ల కృష్ణ(35) ఈ నెల 20న సాయంత్రం 7 గంటలకు బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించగా మంగళవారం కల్వకుంట శివారులోని సబ్ స్టేషన్ సమీపంలో కృష్ణ మృతదేహం కనిపించింది. కుమారుడి మృతిపై అనుమానం ఉన్నదని తల్లి బాలమణి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



సుభాష్(ఫైల్)

కొల్చారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో విషం తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని సంగాయిపేట తండాలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన నేనవత్‌సుభాష్(28) కుటుంబ సమస్యలతో ఇంట్లో గొడవపడ్డాడు. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటి ముందు సుభాష్ వాంతులు చేయడంతో సమీపంలోని పాఠశాల విద్యార్థులు కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. వెంటనే అతడి భార్య షాను చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి తల్లితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

అల్లాదుర్గం, అక్టోబరు 22.(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్వర్ గ్రామపంచాయతీ పరిధిలో గల కుసంబినగర్(పల్లెగడ్డ) వద్ద గల 161వ జాతీయ రహదారిపై ఆటో ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకున్నది. టేక్మాల్ మండలం ఎల్లుపేట గ్రామానికి చెందిన కుమార్ తన ఆటోలో భార్య, పిల్లలతో కలిసి వట్‌పల్లి మండలం పోతులబొగుడ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద వట్‌పల్లి మండలం షాద్‌నగర్ (గట్టుపల్లి) గ్రామానికి చెందిన తలారి గోపాల్ బొడ్మట్‌పల్లి వెళ్లేందుకు కుమార్ ఆటోలో ఎక్కాడు. ఈ క్రమంలో బొడ్మట్‌పల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్ పల్లెగడ్డ వద్ద సడన్‌బ్రేక్ వేయడంతో ఈ ట్రాక్టర్ వెనకనుంచి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్‌తో పాటు ప్రయాణికుడు గోపాల్‌కు తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

13 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

జోగిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ బృందం జోగిపేటలో చేసిన దాడుల్లో అక్రమంగా నిలువచేసిన 13 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు అందోలు డిప్యూటీ తహసీల్దారు శజీయుద్దీన్ మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. పౌరసరఫరాల శాఖ సరిధిలోని ఉమ్మడి మెదక్, మహబూబ్ నగర్ జిల్లాల ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) ద్రోణాచార్యులు నేతృత్వంలో 5 మందితో కూడిన విజిలెన్స్ బృందం జోగిపేట పట్టణంలోని పలు బియ్యం విక్రయ షాపులపై దాడులు చేసింది. ఈదాడుల్లో ఎన్. వెంకటేశం, ఎన్. ప్రభులింగం అనే వ్యాపారులు దుకాణాల్లో అక్రమంగా నిలువ ఉంచిన 13 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు.

గంజాయి పాత నేరస్థులకు కౌన్సెలింగ్

కల్హేర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, అక్రమ రవాణాలో పట్టుబడిన పాత నేరస్థులకు సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిర్గాపూర్ ఎస్ఐ వెంకటరెడ్డి మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నూతన చట్టాల ప్రకారం గంజాయి కేసుల్లో కఠిన శిక్షలు తప్పవని, తిరిగి నేరం చేస్తే పీడీ యాక్టు నమోదు చేసి జైలుశిక్ష పడుతుందన్నారు.

గడ్డపోతారంలో ఇంటి నెంబర్ల కేటాయింపుపై విచారణ

జిన్నారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గడ్డపోతారంలో ఇంటి నెంబర్ల కేటాయింపు వ్యవహారంపై డీఎల్పీవో అనిత విచారణ జరిపారు. మంగళవారం గడ్డపోతారంలో డీఎల్పీవో అనిత, మండల పంచాయతీరాజ్ శాఖ అధికారులు పర్యటించారు. గత ఏడాది ఓ ప్రైవేటు వెంచర్‌లో ఇంటి నిర్మాణాలు జరుపకుండానే ఇంటి నెంబర్ల కేటాయింపు, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం వెలుగు చూడగా.. నాటి పంచాయతీ ఈవోను అధికారులు సస్పెండ్ చేశారు. ఈ విషయమై తాజాగా విచారణ జరిపారు.

అక్రమ మైనింగ్ నివారణకు టాస్క్‌ఫోర్స్ బృందాలు

కోహీర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌ను నివారించేందుకు రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్టు కోహీర్ మండల తహసీల్దార్ బాలశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధికమిటీ సమావేశంలో కోహీర్ మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు అందిందన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



ఔరంగాబాద్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల వర్షాలకు ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో మంగళవారం పట్టణ శివారులోని ఔరంగాబాద్, అవుసులపల్లి, ఔరంగాబాద్ తండా, పాతూరులలో ఆమె నాయకులతో కలిసి పర్యటించారు. అక్కడే ఉన్న రైతులను పరామర్శించి కొట్టుకుపోయిన ధాన్యానికి సైతం ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచే కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ఫోన్లో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి రైతులను ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

సిర్గాపూర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బంద్

కల్హేర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనకు నిరసనగా మంగళవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. నిరసన కార్యక్రమంలో భాగంగా సిర్గాపూర్‌లోని వ్యాపార, వాణిజ్య సముదాయాలను బంద్ చేయించారు. బీజేపీ మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలో హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల, కంది మండలం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఈ నెల 16 నుంచి నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం మంగళవారంతో ముగిసింది.ముగింపు కార్యక్రమంలో డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకురావాలని కోరారు.